సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

సంఘ్ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట రమణ

గాజువాక: వచ్చేనెల 2 నుంచి 12 వరకు నిర్వహించనున్న సంఘ్ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ విశాఖ విభాగం ప్రచారక్ వెంకటరమణ కోరారు. గాజువాకలో శుక్రవారం నిర్వహించిన ఆ సంస్థ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1925 అక్టోబర్‌లో విజయదశమి రోజున ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభమైందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీలాంటి గొప్ప నాయకులను ఆర్‌ఎస్‌ఎస్ దేశానికి అందించిందన్నారు. సమావేశంలో నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, డాక్టర్ శేషు ప్రసాద్, సిరసపల్లి నూకరాజు, శ్రీనివాసరావు, కొమ్మినేని శ్రీనివాస్, గూటూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



పాటల రూపంలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కూర్మన్నపాలెం: సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శుక్రవారం జీవీఎంసీ 87వ వార్డు కణితి గాంధీబొమ్మ సెంటర్‌లో పలువురు కళాకారులు పాటల రూపంలో వివరించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కళాకారులు సూచించారు. తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని.. కాలువల్లో చెత్తా చెదారం పేరుకు పోకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గాజువాక జోన్ పారిశుధ్యవిభాగం అధికారులు సిబ్బంది అప్పారావు, జగన్నాథరావు, స్థానిక నాయకులు దుగ్గపుదానప్పలు తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి దేవాలయంలో ప్రత్యేకపూజలు

ఉక్కునగరం: ఉక్కునగరం త్రిశక్తి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. ఐదవ రోజు శుక్రవారం మహాదుర్గ అమ్మవారు బంగారు వర్ణం చీరలో మహాలక్ష్మీదేవిగా, మహాలక్ష్మి అమ్మవారు ఆకు పచ్చ వర్ణం చీరలో గజలక్ష్మిగా, మహాసరస్వతి అమ్మవారు ముదురు ఎరుపు వర్ణం చీరలో జగద్విఖ్యాత అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో ఉదయం అమ్మవార్లకు సహస్ర తామర పుష్పార్చన చేశారు. సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రవి కుటుంబానికి అండగా ఉంటాం



నిత్యావసర సరకులు అందిస్తున్న అధ్యక్షుడు పూర్ణ

అగనంపూడి: అనారోగ్యంతో మృతిచెందిన రవి కుటుంబానికి అండగా నిలుస్తామని 85వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) అన్నారు. దానబోయిపాలేనికి చెందిన అన్నవరపు రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలుసుకొని బియ్యం ఇతర నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉక్కు మాజీ అధికారి గుదే సుశీలా గజేంద్రరావు మాట్లాడుతూ సేవకునిగా పేరు తెచ్చుకున్న పూర్ణ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యలమంచిలి అప్పారావు, నాయకులు ఎల్.వి. రమణ, పట్టా రామకృష్ణ, సతీష్, రమణమ్మ, సన్ని తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అగనంపూడి: ఏపీఈపీడీసీఎల్ మంగళపాలెం సబ్‌స్టేషన్ అగనంపూడి సెక్షన్ కార్యాలయ పరిధిలో నిర్వాహణ పనులు నిర్వహిస్తున్న క్రమంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆర్‌ఈసీఎస్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. దువ్వాడ సెక్టార్-1, మంగళపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, వెదుళ్లనరవ, గంగవరం, శెట్టివానిపాలెం, లంకెవానిపాలెం, నంగినారపాడు, అజనగిరి గ్రామాలకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గాజువాకలో ఫ్యామిలీ కోర్టు ఏర్పాటుకు కృషి




సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులు

గాజువాక: గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో ఫ్యామిలీ కోర్టు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని గాజువాక బార్ అసోసియేషన్ తీర్మానించింది. శుక్రవారం జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహకారంతో ఫ్యామిలీ కోర్టు ఏర్పాటుకు కృషి చేయాలని నిర్ణయించారు. ఏడాదిగా ఖాళీగా ఉన్న జూనియర్ సివిల్ జడ్జి నియామకం కోసం ఉన్నత న్యాయస్థానంలో అభ్యర్థించాలని నిర్ణయించినట్టు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. బార్ అసోసియేషన్‌కు శాశ్వత భవనం నిర్మాణ అనుమతులపై చర్చించారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి సభ్యులు సహకరించాలని అసోసియేషన్ అధ్యక్షురాలు యశోధర వేదమణి కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి డి.చిరంజీవి, సభ్యులు పల్లా శ్రీనివాస్, బి.వి.ఎం.కృష్ణ, సీనియర్ న్యాయవాదులు మురళీకృష్ణరాజు, ప్రభాకరరావు, రత్నరాజు, చిరంజీవి, పట్టాభి రామారావు, రమణబాబు పాల్గొన్నారు.

కల నెరవేరిన వేళ

ఫలించిన అగనంపూడి వాసుల పోరాటం

- **జోన్-9 కార్యాలయంగా అగనంపూడి కల్యాణ మండపం!**
- **జోన్ ఖరారు కావడంతో అధికారుల నిర్ణయం**
- **సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు**



అగనంపూడి వ్యూ

అగనంపూడి: అగనంపూడి, దువ్వాడ, ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ వాసుల పోరాటం ఫలించింది. తమ ప్రాంతాన్ని పెందుర్తి-2 జోన్‌గా ఏర్పాటు చేయాలని జీవీఎంసీ పాలక వర్గం నిర్ణయించడంతో ఈ ప్రాంతీయులు పార్టీలకు అతీతంగా నిరసన గళం వినిపించారు. 35 కిలోమీటర్ల దూరం ఉన్న పెందుర్తిలో ఎట్టిపరిస్థితుల్లో కలపవద్దని... సుమారు 60 వేల జనాభా ఉన్న అగనంపూడి కేంద్రంగా కొత్త జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆకాంక్షలను వివరిస్తూ సాక్షిలో కథనం కూడా ప్రచురితమైంది. కూటమికి చెందిన ప్రజాప్రతినిధులకు భౌగోళిక పరిస్థితులను వివరిస్తూ వినతిపత్రాలు అందజేశారు. పెందుర్తిజోన్‌లో తమ గ్రామాలను కలిపితే ఆందోళన బాట పడతామని స్పష్టం చేశారు. దీంతో పునరాలోచనలో పడ్డ పాలకులు అగనంపూడి కేంద్రంగా జోన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

అధికార వికేంద్రీకరణ కోసం ప్రస్తుతం జీవీఎంసీలో ఉన్న 8 జోన్లను పది జోన్లకు పెంచాలని జీవీఎంసీ పాలక వర్గం నెల రోజుల కిందట నిర్ణయం తీసుకుంది. గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల పరిధిలోని 77,78,79,88 వార్డులతో పెందుర్తి-2గా నామకరణం చేస్తూ నిర్ణయం తీసుకోవడం, గెజిట్ విడుదల చేసి ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదం కోసం పంపింది. పాలనా సౌలభ్యం పేరుతో తమకు అధికారులు అందుబాటులో లేకుండా కుట్రకు తెరలేపారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు వ్యతిరేకించగా, పాలకపక్షంలో మంటలు రేపాయి. దీంతో విషయాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు టీడీపీ అధినాయకత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అగనంపూడి కేంద్రంగా జోన్ ఏర్పాటు చేస్తూ ప్రకటించింది.



సాక్షిలో ప్రచురితమైన కథనం

88లోని అగనంపూడి, దువ్వాడ కాలనీల పరిస్థితి ఏంటి?

88వ వార్డులోని అగనంపూడి లోని రెండు నిర్వాసితకాలనీలు, దువ్వాడ సెక్టార్-1, వెదుళ్లనరవ, నంగినారపాడు, గంగవరం ప్రాంతీయులు కూడా అగనంపూడి జోన్‌లోనే తమ ప్రాంతాలు విలీనం చేయాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే దువ్వాడ సెక్టార్-2 కాలనీ 86వ వార్డులో ఉంది. ఈ గ్రామానికి అగనంపూడి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఈ గ్రామవాసులు కూడా అగనంపూడి జోన్‌లోనే తమ గ్రామాన్ని విలీనం చేయాలని కోరుతున్నారు.

స్వరూపం ఇలా

పెందుర్తి-2 జోన్‌గా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదిత వార్డులు 77,78,79,85ల్లో కొన్ని ప్రాంతాలు పెందుర్తి నియోజకవర్గంలో ఉన్నాయి. అధిక భాగం గాజువాక నియోజకవర్గంలోనే ఉన్నా యి. ఈ ప్రాంతాలకు గాజువాక జోనల్ కార్యాలయం ఎటూ వైపు చూసినా 8 నుంచి 10 కిలోమీటర్ల దాటదు. అలాంటిది ఈ ప్రాంతాలను 35 నుంచి 40 కిలోమీటర్ల దూరంలోని పెందుర్తి ప్రాంతంలో జోన్ ఏర్పాటు చేయాలనే కుట్రను ప్రజలు, ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ, కూటమి నాయకులు తీవ్రంగా వ్యతిరేకించడంతో పాలకపక్షం తప్పనిసరి పరిస్థితు ల్లో పెందుర్తి-2 బదులుగా అగనంపూడిని జోన్-9గా ప్రకటిస్తూ గెజిట్ విడుదల చేసింది. అగనంపూడిని రూరల్ మండలంగా ఏర్పాటు చేయాలనే దశాబ్దంన్నర ప్రతిపాదనలకు కొంత ఊరటనిచ్చింది.

జోన్ కేంద్రంగా కల్యాణమండపం

అగనంపూడిలో జోన్-9 కార్యాలయం ఏర్పాటు చేయడానికి కావాల్సిన సదుపాయాలు, వసతులపై గాజువాక జోనల్ కార్యాలయంలో చర్చించారు. అగనంపూడిలోని రాజీవ్‌గాంధీ కల్యాణ మండపం ప్రస్తుతానికి సరైన వేదికగా నిర్ణయిస్తూ అధికారులు ప్రతిపాదనలు చేశారు. వచ్చేనెల 2వ వారంలోగా ఇక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.



అగనంపూడి కల్యాణ మండపం

అందుబాటులో ఉంటుంది



ఇప్పటి వరకు జీవీఎంసీలో ఏపని వచ్చినా గాజువాకలోని జీవీఎంసీ జోనల్ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇంతలో ఈ ప్రాంతాన్ని పెందుర్తి-2 జోన్‌లో కలపాలని యోచించారు. దీన్ని వైఎస్సార్‌సీపీ, ప్రజలతో పాటు కూటమి నాయకులు కూడా వ్యతిరేకించడంతో ప్రభుత్వం స్పందించి అగనంపూడి జోన్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. నాలుగు వార్డుల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సమస్యలు సత్వరం పరిష్కరించడానికి అవకాశం ఉంటుంది.

– ఎం.మస్తాన్‌రెడ్డి, అగనంపూడి

పునరాలోచించారు



నిరసన సెగలు వెల్లువెత్తే సమయంలో పాలక వర్గం వెనక్కి తగ్గి పునరాలోచించి అగనంపూడి జోన్ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టం సంతోషదాయకం. ప్రతిపక్ష పార్టీ నాయకులు, ప్రజలు ఆందోళనబాటపట్టడంతో స్థానిక కూటమి నాయకులు కూడా ఒత్తిడి తెచ్చి అగనంపూడి జోన్ సాధించగలిగారు. సంతోషంగా ఉంది. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది.

–ఎం.శ్రీనివాసరావు, ఫార్మాసిటీ కాలనీ

మా గ్రామాలు అగనంపూడిలో కలపండి



85, 88 వార్డుల్లోని దువ్వాడ సెక్టార్-1,2 గ్రామాలతోపాటు గంగవరం, కొత్తూరు, నంగినారపాడు, వెదుళ్లనరవ గ్రామాలను కూడా అగనంపూడి జోన్‌లో కలిపేయాలి. మాకు అందుబాటులో అగనంపూడి ఉంది. రెండు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న అగనంపూడి ఐతే మాకు సౌలభ్యంగా ఉంటుంది. పాలక పక్షం ఈ విషయంలో చొరవ తీసుకోవాలి.

– సీహెచ్.రమణ, దువ్వాడ

సంస్థల పురోగతిలో క్వాలిటీ కాన్సెప్ట్స్ కీలకం



అతిథులతో క్యూసీఎఫ్ఐ ప్రతినిధులు

ఉక్కునగరం: సంస్థల అభివృద్ధిలో క్వాలిటీ కాన్సెప్ట్స్ కీలక పాత్ర పోషిస్తాయని నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్ రియర్ అడ్మిరల్ కె. శ్రీనివాస్ అన్నారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఉక్కు ఎంపీ హాలులో నిర్వహించిన చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్ (సీసీక్యూసీ)-2025 పోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్వాలిటీ సర్కిల్స్, పని ప్రదేశ నిర్వహణ, లీన్ క్వాలిటీ సర్కిల్స్ , కైజన్ వంటి వాటిలో ఉద్యోగులు భాగస్వామ్యం వల్ల పని సులువుగా పూర్తి అవుతుందని చెప్పారు. భెల్ ఈడీ జి. సుబ్రమణ్యం, కోరమాండల్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావులు మాట్లాడుతూ సీసీక్యూసీలో అనేక సంస్థల ప్రతినిధులు పాల్గొవడం అభినందనీయమన్నారు. క్యూసీఎఫ్ఐ చాప్టర్ చైర్మన్ జి. గాంధీ, చాప్టర్ కార్యదర్శి సాగర్ కన్వెన్షన్ వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో 34 సంస్థలకు చెందిన 149 మంది కేస్ స్టడీలు అందజేశారన్ని తెలిపారు. పోటీల విజేతలు డిసెంబర్‌లో ఢిల్లీలో జరగనున్న జాతీయ పోటీలకు హాజరవుతారని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చాప్టర్ వైస్ చైర్మన్ కమొడోర్ గగన్‌దీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ వద్దని ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సేవా సంఘం సభ్యులు

పెదగంట్యాడ: పెదగంట్యాడలో అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవద్దని నెల్లిముక్కు గ్రామం పెంటమాంబ యువజన సేవా సంఘం సభ్యులు స్పష్టం చేశారు. ఈ మేరకు పెదగంట్యాడ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతిపాదనకు వ్యతిరేకంగా శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే గంగవరం పోర్టు, ఆటోనగర్‌లోని పలు కంపెనీల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో స్థానికులు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల మరిన్ని సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. జనావాసల సమీపంలో పరిశ్రమలు పెడతామంటే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. అధికారులు,స్థానిక నాయకులు స్పందించి సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు ధర్మాల ఎల్లయ్యరెడ్డి, బసా అప్పారావు, నీలాపు సత్తిబాబు, బసా అప్పలరెడ్డి, గొందేశి సుమన్‌రెడ్డి, ధర్మాల రామిరెడ్డి, అప్పలరెడ్డి, పెంటయ్యరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, భానుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లింగేశ్వరరావుకు అభినందన



లింగేశ్వరరావును అభినందిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్, కార్పొరేటర్ ఉషశ్రీ

ఉక్కునగరం: అంతర్జాతీయ మాస్టర్స్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల విజేత, స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి బి.వి.ఎస్.కె. లింగేశ్వరరావును శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అభినందించారు. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో థాయ్‌లాండ్‌లో ఈ నెల 7 నుంచి 14 వరకు నిర్వహించిన పోటీల్లో 55+ కేటగిరీలో సుజానే వింగ్‌లెట్‌తో లింగేశ్వరరావు పాల్గొన్నారు. మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీలో పాల్గొని రజత పతకం గెలుపొందారు. ఈ సందర్భంగా శుక్రవారం జీవీఎంసీ కార్యాలయంలో లింగేశ్వరరావును కమిషనర్ అభినందించారు. కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ పాల్గొన్నారు.

పది కుటుంబాలకు నిత్యావసర సరకులు



నిత్యావసర సరకులు అందిస్తున్న సుశీలా గజేంద్రరావు

అగనంపూడి: ఉక్కు మాజీ అధికారి, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు తన తల్లిదండ్రులు నారాయణమ్మ, గజ్జాలు సంస్మరణార్థం పది నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నితావ్యసర సరకులు అందించారు. అలాగే ఇటీవల స్టీల్‌ప్లాంట్ తొలగించిన ఐదుగురు ఒప్పంద కార్మికులకు బియ్యం, ఇతర వంట సామాన్లు అందించి ఉదారత చాటుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కొలిపాక అప్పారావు, చంటి, మారా మస్తాన్‌రెడ్డి, గంధోళి నరసింగరావు, శీరంశెట్టి గోవిందరావు, లక్కరాజు రాము పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



అన్నవితరణ చేస్తున్న చింతలపూడి వెంకటరామయ్య తదితరులు



దల్లివానిపాలెంలో ధనలక్ష్మిగా ..



త్రిపురసుందరీదేవిగా అమ్మవారు



మహాలక్ష్మి రూపంలోని దుర్గాలమ్మకు కరెన్సీ అలంకరణ



లంకెలపాలెంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పూర్ణ



చిన్నారులను సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

కూర్మన్నపాలెం: శరన్నవరాత్రి ఉత్సవాలు వడ్లపూడి నిర్వాసితకాలనీల్లో కడురమ్యంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. దీనిలో భాగంగానే 87వ వార్డులో అమ్మవారిని శుక్రవారం త్రిపురసుందరీదేవి రూపంలో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా పద్మశాలి వీధిలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను మాజీఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి చింతలపూడి వెంకటరామయ్య హాజరై భక్తులకు వడ్డన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇల్లపురాము, జి.రాంబాబు, కర్రినాగేశ్వరరావు, గుంట్లశ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే 87వ వార్డు రథాలమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన అన్నవితరణ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడ శ్రీను, బొడ్డగోవింద, దానప్పలు, వెంకటసూరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి నమోస్తుతే

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు బర్మాకాలనీలో కనకదుర్గ అమ్మవారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మహాలక్ష్మి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కరెన్సీ అలంకరణలో...

దల్లివానిపాలెం కూడలిలో జాగరపు శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద అమ్మవారిని రూ. లక్ష రూపాయల కరెన్సీతో మహాలక్ష్మి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అగనంపూడి: అగనంపూడిలోని దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారిని అమ్మవార్ని రూ.69,500 నోట్లతో అలంకరించారు. ఈసందర్భంగా గోమాత పూజలు, సామూహిక కుంకుమ పూజలు జరిపించారు. ఆలయ కమిటీ ప్రతినిధి చిత్తా కనకరాజు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అగనంపూడి, నిర్వాసిత కాలనీలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు లంకెలపాలెంలోని దుర్గమాంబ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో 85వ వార్డు అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ), నాయకులు సుందరపు అప్పారావు, గెంజి సురేష్, యలమర్తి వెంకటరావు, కాతా నూకేష్, సుధీర్, సునీల్, జగన్ పాల్గొన్నారు.

➡ పెదమడక సూది కొండపై ఉన్న మాతా దుర్గా భవానీ ఆలయంలో 85వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పూర్ణ సహకారంతో 500 మంది భవానీలు, భక్తులకు అన్న ప్రసాదం అందించారు. 79వ వార్డులోని శనివాడ జూబిలీహిల్స్‌లో అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులు నవదుర్గలు (చైతన్య దేవతలు)గా నృత్య ప్రదర్శన చేశారు. గొల్లవిల్లి కనక భవాని, బ్రహ్మకుమారీలు అఖిల , మణి, శ్రీదేవి, శ్రావణిపాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్

అగనంపూడి: విద్యా బోధనలో విలువలు ముఖ్యమని, విద్యార్థి బయట ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని నిలబడేలా తీర్చిదిద్దడమే విజ్ఞాన్ విద్యా సంస్థల లక్ష్యమని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్ అన్నారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మంచి విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించే శక్తిని ఇస్తున్నామన్నారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, విజ్ఞాన్ పాఠశాల ప్రిన్సిపాల్ మాధురి మాట్లాడుతూ పాఠాలతో పాటు అవసరమైన నైపుణ్యం అందించడం ద్వారా విద్యార్థులు ఉత్తమంగా ఎదుగుతారన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీన్లు హరగోవిందరావు, కె.మధుసూతనరావు, బొడే ప్రసాద్, బండారు సతీష్ పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ విభాగాధిపతికి సత్కారం



స్టీల్‌ప్లాంట్ ప్లాంట్ హెచ్‌ఆర్ విభాగాధిపతి భానును అభినందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: జాతీయ స్థాయి జెండర్ డైవర్సిటీ అవార్డు గ్రహీత, స్టీల్‌ప్లాంట్ ప్లాంట్ పర్సనల్ విభాగాధిపతి ఎస్. భానును శుక్రవారం స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు అభినందించారు. న్యూఢిల్లీలో కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఇటీవల ఆయన ప్రతిష్టాత్మక జెండర్ డైవర్సిటీ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో వివిధ విభాగాల్లో పని చేసి ఆయా విభాగాల అభివృద్ధికి భాను ఎనలేని కృషి చేశారన్నారు. ఆమె ఇలాంటి అవార్డులు మరిన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాద్, నాయకులు రమణమూర్తి, మద్ది అప్పలరాజురెడ్డి, ఎన్. రమేష్‌కుమార్, వెంకన్న, కోటయ్య, పైడికొండలరావు తదితరులు పాల్గొన్నారు.